మురిసిన మండపేట

- పారిశుధ్య నిర్వహణలో రాష్ట్రంలో మొదటి స్థానం
- వైఎస్సార్ సీపీ పాలకవర్గం హర్షం
- వైఎస్ జగన్ హయాంలో విశేషంగా పట్టణాభివృద్ధి
- మరింత ఉత్సాహంతో పని చేస్తామంటున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం(మండపేట): మండపేట మున్సిపాలిటీకి పారిశుధ్య నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో గుర్తింపు దక్కింది. గత మూడు నెలల్లో పట్టణంలోని నివాసాల నుంచి చెత్త సేకరణ విషయంలో రాష్ట్రంలోని 77 మున్సిపాలిటీల్లోకెల్లా మండపేట ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖాధికారుల పర్యవేక్షణలో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. ప్రత్యేకమైన వ్యవస్థ ద్వారా ఫోన్ కాల్స్ చేసి చెత్త సేకరణపై పట్టణ వాసుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. దాని ఆధారంగా ర్యాంకింగ్ ఇచ్చారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సంతోషం వ్యక్తం చేశారు. పాలకవర్గం ఏర్పడిన నాటి రోజుల్లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణాభివృద్ధికి విశేషంగా కృషి చేసింది. పారిశుధ్యం, తాగునీరు, రహదారుల నిర్మాణం తదితర అంశాల్లో వ్యవస్థాపరమైన చర్యలు చేపట్టింది. వాటి తాలూకు ఫలితాలు నేటికీ మున్సిపాలిటీకి వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రథమ స్థాయి గుర్తింపుతో పట్టణ ప్రజలు, పాలకవర్గం, వైఎస్సార్ సీపీ శ్రేణులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

మొదటి స్థానం వెనుక నేపథ్యమిదీ

శ్రామికవర్గం పట్టణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తూనే ఉంది. పట్టణంలో 31 మంది శాశ్వత, 81 మంది కాంట్రాక్ట్ మొత్తం 112 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, టౌన్ ప్లానింగ్ విభాగం, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరి భాగస్వామ్యమూ ఈ గుర్తింపులో ఉందంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ప్రశంసించారు. నూరు శాతం చెత్తను వదలకుండా సేకరించి పారిశుధ్యాన్ని పరిరక్షిస్తున్నందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు దక్కాయి. పట్టణంలో రోజుకు 32 టన్నుల వ్యర్థాలు పోగుపడుతున్నాయి. వాటిలో రెండు టన్నులను వర్మీ కంపోస్టు యార్డుకు వినియోగిస్తున్నారు. కేంద్రంలో 10 బ్లాకులుండగా ఎరువు తయారీకి సుమారు 60 రోజులు పడుతుంది. ఎరువును మున్సిపాలిటీ పరిధిలోని మొక్కలకు ఎరువుగా వినియోగిస్తున్నారు. కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, 14 సచివాలయాలకు గాను ఏడుగురు సచివాలయ కార్యదర్శులు రోజూ చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో కార్యదర్శి రెండు సచివాలయాల పరిధిలోని వీధుల్లో పారిశుధ్య పరిరక్షణ బాధ్యతలను చూస్తున్నారు.

ఎమ్మెల్సీ తోట చొరవతో..

క్లీన్ మండపేట లక్ష్యంగా చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల నిల్వకు అప్పటికే ఉన్న 2.5 ఎకరాల డంపింగ్ యార్డు విస్తీర్ణ సరిపోలేదు. సుమారు 11 ఏళ్ల క్రితం అదనంగా మరో 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించినప్పటికీ స్థల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో స్థలం వినియోగ ప్రక్రియ నిలిచిపోయింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్థల యజమానులతో చర్చించి కేసులను విరమించుకునేందుకు కృషి చేశారు. రూ.2.14 కోట్ల స్థల యజమానులకు చెల్లించడం ద్వారా సెప్టెంబర్ 16న స్థలాన్ని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.65 కోట్లతో 3.10 కిలోమీటర్లు మేర 54 డ్రైన్లను మంజూరు చేయగా 2.05 కోట్లతో 2.52 కిలోమీటర్లు మేర 48 డ్రైనేజీలు పూర్తయ్యాయి. ఇలాంటి చొరవతో కూడిన కృషితో మండపేటలో పారిశుధ్య పరిరక్షణకు సాధ్యపడుతుంది.

పట్టణ ముఖచిత్రం

పట్టణం ఏర్పాటు	1958
విస్తీర్ణం	21.65 చదరపు కిలోమీటర్లు
జనాభా 53,588 (2011 జనాభా లెక్కలు ప్రకారం)	
మొత్తం ఓటర్లు	48,150
పురుష ఓటరు	22,825
మహిళా ఓటర్లు	25,325
పోలింగ్ స్టేషన్లు	45
నివాసాలు	15,334
వార్డులు	30



మండపేట మున్సిపల్ కార్యాలయం



మండపేట పట్టణంలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు



మండపేట పట్టణంలో ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికురాలు

సమష్టి కృషితో రాష్ట్ర స్థాయి గుర్తింపు



మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో పట్టణంలో మెరుగైన పాలనను అందిస్తున్నాం. అధికారులు, కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యతనిస్తూ వస్తున్నాం. మున్సిపల్ పాలనలో ప్రతి విభాగము విధుల నిర్వహణలో శ్రమిస్తున్నారు. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో ప్రథమ స్థాయి గుర్తింపు దక్కడం వెనుక పారిశుధ్య కార్మికుల కృషి, అధికారుల పర్యవేక్షణ ఎంతగానో దోహదపడ్డాయి.

– పతివాడ నూక దుర్గారాణి, చైర్‌పర్సన్, మండపేట

పాలకవర్గం గర్వించదగ్గ గుర్తింపు



మున్సిపల్ కౌన్సిల్ నిరంతరం పట్టణ సమస్యలపై శాస్త్రీయ పద్ధతిలో చర్చిస్తుంది. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకుంటుంది. కౌన్సిల్ సభ్యులు అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నాం. పారిశుధ్య కార్మికులు, ఇతర విభాగాల శ్రామికుల కృషితో మున్సిపాలిటీకి గుర్తింపు దక్కింది.

– పిల్లి శ్రీనివాస్, కౌన్సిలర్, మండపేట

క్లుప్తంగా

అశిరాంబ అమ్మవారి ఊరేగింపు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ఆరాధ్య దైవం అశిరాంబ అమ్మవారిని సోమవారం ఇరు గ్రామాల్లోనూ ఊరేగించారు. ఆలయ ఆసాదులు అమ్మవారి గరగను తలపై ధరించి వీధుల్లో భక్తుల చెంతకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల ఆడపడుచులు అమ్మవారికి కానుకలు సమర్పించారు. ఆలయ నిర్వాహణ కమిటీ నాయకుడు రాగం రామచంద్రరావు మాట్లాడుతూ అమ్మవారి జాతరకు ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 20న ఆలయం నుంచి గ్రామ వీధుల్లో జాతర, 21న ఆలయం వద్ద తీర్థం, 22న అమ్మవారికి నైవేద్య సమర్పణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి



కేదారిలంక వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నదిలో వరదనీరు సోమవారం ఉధృతంగా కొనసాగింది. తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, గోదావరి హెడ్ వర్క్స్ శాఖల అధికారులు, సిబ్బంది సోమవారం గోదావరి వరద పరిస్థితిని సమీక్షించారు. కేదారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు చైర్‌పర్సన్ పలకరింపు



మండపేటలో దొరబాబును పరామర్శిస్తున్న దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకొంటున్న 20వ వార్డునకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బత్తిన దొరబాబును మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పలకరించారు. దొరబాబు కుటుంబ సభ్యులకు సోమవారం ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఆమె వెంట పార్టీ కార్యకర్తలు పేరూరి మాధవి, కొమ్మోజు నాగేశ్వరరావు, కాకాడ నూకరాజు, మోర్తా లక్ష్మి, పీనెడ్డి కృపావతి, పిల్లి శివ కనక వరాలు ఉన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ, రాష్ట్రీయ ఎన్నికల కమిషనర్ల ఆదేశాలపై మండపేట పట్టణ, రూరల్ మండలంలోని 12 గ్రామాల పోలింగ్ బూత్‌ల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. 15న మండపేట పట్టణంలోని 46 మంది బీఎల్‌ఓలకు మున్సిపల్ కార్యాలయం లోనూ, 16న మండపేట రూరల్ మండలంలోని 45 మంది బీఎల్‌ఓలకు మండపేట ఎంపీడీఓ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లోనూ, శిక్షణ ఇవ్వనున్నట్టు ఎన్నికల నమోదు అధికారి తెలిపారు.

యనమదల సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన యనమదల సొసైటీ పాలకవర్గం

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా నిర్వహించారు. తాడిపల్లి గ్రామానికి చెందిన మాదాల ఆనంద్‌రావు చైర్మన్‌గా, గుణ్ణం కృష్ణమూర్తి, రొక్కాల రామారావులు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ సర్పంచ్ కొండేపూడి శ్రీనివాస జానకిరామయ్య, బుంగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్లమూరు గ్రామంలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సోమవారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాను నిలిపివేయనున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్యనారాయణ కృషితో పార్టీ బలోపేతం

కపిలేశ్వరపురం: మండలంలో వైఎస్సార్ సీపీని నిర్మాణపరంగా బలోపేతం చేయడంలో కృషి చేస్తున్న తాతపూడికి చెందిన గూటం సత్యనారాయణను అంగరలోని పార్టీ మండల కార్యాలయంలో ఆదివారం రాత్రి మండల స్థాయిలో దళిత యువత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దళిత నాయకుడు పాలింగి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గూటం సత్యనారాయణ చేస్తున్న కృషికి ప్రతిబింబంగా కేక్‌ను కట్ చేసి ఆయన సేవలను ప్రశంసించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పలివెల మధు, దళిత నాయకులు ఏలేటి గంగరాజు, రేలంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పార్టీ ద్వారా ప్రజలకు అండగా నిలవడంతో సత్యనారాయణ కృషి ప్రశంసించతగినదన్నారు. గూటం సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల నాయకులను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళిత నాకులు బడుగు ప్రవీణ్, నేలపూడి శ్రీను, ఖండవిల్లి సత్యనారాయణ, తాతపూడి రాజేష్‌శర్మ, కొత్తపల్లి వినోద్, మోర్త రమేష్, మాతా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంగరలో గూటం సత్యనారాయణను సత్కరిస్తున్న ఎంపీపీ, దళిత సోదరులు

ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

రాయవరం: విద్యతోనే అభివృద్ధి జరుగుతుందని, అలాగే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి అన్నారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు నిర్వహించిన అవగాహనా సమావేశంలో మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం వి.శాంతిసునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెక్నాలజీని మీ భవిష్యత్తుకు ఉపయోగించాలన్నారు. సమావేశంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మండపేట రూరల్ సీఐ బి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు, డిస్ట్రిక్ట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధికారి అభిరామ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని తదితరులు మాట్లాడారు. 9,10, ఇంటర్ చదువుతున్న బాలికలు సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

కల్వర్టుకు రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి



మొగలిపాలెంలో శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్న కల్వర్టు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెంలో పంటకాలువపై ఉన్న కల్వర్టు ప్రమాదభరితంగా మారింది. గత 15 ఏళ్ల క్రితం పంచాయతీ నిధులతో అధికారులు ఈ కల్వర్టును నిర్మించారు. క్రమేపీ కల్వర్టు కింది భాగంలో మట్టి కరిగిపోయి కాలువలోకి కలసిపోవడంతో రహదారి కింది భాగం గుల్లగా మారింది. దీంతో ట్రాక్టర్, లారీ వంటి భారీ వాహనాలు ప్రయాణిస్తే కల్వర్టు విరిగిపోయి కూలిపోతుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణచర్యలు చేపట్టాలని స్థానికులు నల్లమిల్లి ఆదిరెడ్డి, ద్వారంపూడి శేషారెడ్డి, మల్లిడి సూర్యనారాయణరెడ్డి తదితరులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి పలువురి విరాళాలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేసున్న నిత్యాన్నదాన పథకానికి పాలకొల్లుకు చెందిన పొన్నయుగ శ్రీసత్యదేవ్, స్వాతి దంపతులు సోమవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ అర్చక, కార్యాలయం సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.



అయినవిల్లిలో దాత దంపతులకు స్వామి చిత్రపటం అంజేస్తున్న అర్చకులు

నిత్యాన్నదానానికి రూ.11 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన వాయువేగుల శ్రీరామారావు, శ్యామల సుభద్ర దంపతులు సోమవారం రూ.11,111 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ వేద పండితులు జె.సోమయాజులుకు అందజేశారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ దాత దంపతులను సత్కరించారు.

గ్రామస్థాయిలో కూటమి మోసాలను ఎండగడదాం

కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్



హసన్‌బాదలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: గడచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బాబు ష్యూరిటీ పేరుతో అబద్ధపు వాగ్దానాలు చేసి చంద్రబాబునాయుడు చేసిన మోసాలను గ్రామ స్థాయిలో ఎండగట్టడానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. మండలంలోని హసన్‌బాదలో సోమవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి గెలవడమే ప్రధానంగా సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు మోసపు హామీలను ఇచ్చారన్నారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టినా సూపర్ సిక్స్ వాగ్దానాలను గాలికి వదిలేసి ప్రజలను మభ్యపెట్టేందుకు డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కితే ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రీకాల్ మేనిఫెస్టోను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాలని కోరారు. పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి భవాని, పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు మాట్లాడుతూ జగన్ అంటే నిజమని, చంద్రబాబు అంటే అబద్ధమని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల అధ్యక్షుడు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం



ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీరామ నామ సప్త సప్తాహం ఆరోవారం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామికి ఉష్ట్ర వాహనంపై సోమవారం ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, సభ్యులు జోగా శ్రీను, సాక్షి పద్మనాభం, వాసంశెట్టి చిన్ని, వాసంశెట్టి చిన్నబాబు, నంగి బుజ్జి, ఏలూరి పద్మ, బొక్కా భద్రరావు, కోలాటం బృందాలు, సతార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వీడని ముంపు

అయినవిల్లి: వరదనీరు క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. మండలంలోని ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో, ముక్తేశ్వరం వృద్ధ గౌతమి (తొగరపాయ) పాయలో, ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే వద్ద ఇటుకబట్టీల్లోకి చేరిన వరద తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి తగ్గడంతో లంక గ్రామాల్లోని ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే లంక గ్రామాల్లో నదీ పరీవాహక పల్లపు ప్రాంతాల్లోని వరద ముంపు చేరడంతో లంకల్లోని పంటపొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన పాములతో భయం పట్టుకుంది. ఎక్కడ పాములు తమపై దాడి చేస్తాయోనని భయపడుతున్నారు.



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద ఇటుక బట్టీని చుట్టుముట్టిన వరద

ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మానం

కొత్తపేట: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉత్తమ ఫలితాలతో ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందని, భవిష్యత్‌లో మరింత గుర్తింపు తీసుకురావాలని బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి మండలం, జిల్లా పరిధిలో వివిధ పాఠశాలలకు బదిలీ అయిన హెచ్ఎం, ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మానం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల హెచ్ఎంగా పనిచేసిన శర్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మారుతీ శ్రీనివాస్, సాంబశివరావు, శ్రీనివాసరావు, ఎస్ఎస్ కుమార్, వై.నాగమణి, వెంకటలక్ష్మి, శర్వాణిలు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పాఠశాల హెచ్ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో సర్పంచ్ లక్ష్మీపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులను లక్ష్మీపతిరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ డి.యేసయ్య, పలువురు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

కాజులూరు: సమాజంలో రోజురోజుకీ జీవనాధారం కోల్పోతున్న స్వర్ణకారులను ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందించి ఆదుకోవాలని కాజులూరు మండల స్వర్ణకారుల సంఘం నాయకుడు గౌరీపట్నం రామలింగేశ్వరరావు అన్నారు. సోమవారం కాజులూరులో జరిగిన స్వర్ణకారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రెడీమేడ్ ఆభరణాలు విక్రయించే పెద్దపెద్ద సంస్థలు వినూత్న ప్రచారాలతో పోటీపడుతూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయన్నారు. దీంతో దశాబ్దాల నుంచి వంశ పారంపర్యంగా ఆభరణాల తయారుచేస్తున్న స్వర్ణకారులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. పాలకులు స్పందించి చేతివృత్తి సంఘాలకు నిధులు కేటాయించాలని స్వర్ణకారులకు జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వలస కూలీల పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు పుట్టినరోజు సందర్భంగా దాత మచ్చా కుమార్‌రాజా సౌజన్యంతో ప్రముఖ మనస్తత్వవేత్త, ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్ (శ్యామ్ జాదూగర్) సభ్యులు వివిధ రాష్ట్రాల నుంచి పొలం పనులు చేసుకోవడానికి వచ్చిన వలస కూలీల చిన్నారులకు అనూస్ స్వచ్ఛంద సంస్థ సేవా సంస్థ ద్వారా పుస్తకాలు, పలకలు, స్టేషనరీని అందించడంతో పాటు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్యామ్‌జాదూగర్ మాట్లాడుతూ పేదరికం చదువుకి ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నపూర్ణ డే కేర్ హోం నందు వృద్ధులకు అన్నదానం నిర్వహించి పలువురు పేద చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనూస్ సభ్యులు డాక్టర్ మోహిత్, అన్నపూర్ణ, తేజశ్రీ, రుషిత్ తదితరులు పాల్గొన్నారు.

సంకష్టహర చతుర్థి పూజలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం సంకష్టహర చతుర్థి పూజలు వైభవంగా జరిపారు. స్వామి వారికి వేకువజాము నుంచి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాల మధ్య మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఆలయంలో నిర్వహించే లక్ష్మీగణపతి హోమంలో 44 మంది భక్త దంపతులు పూజలు జరిపారు. అలాగే స్వామికి ఇరువురు జంటలు పంచామృతాభిషేకం, లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 47 మంది భక్తదంపతులు పాల్గొన్నారు. ఈ స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.